సాక్షి మెదక్

శుక్రవారం, 20, డిసెంబర్, 2024



రెవెన్యూ డివిజన్ అయ్యేనా?

మంత్రి పొంగులేటి ప్రకటన నేపథ్యంలో 'దుబ్బాక రెవెన్యూ డివిజన్‌పై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

– వివరాలు 8లో ▸



జాతీయ పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు.

వివరాలు 8లో ▸



అందుబాటులో భారత్‌రైస్

ఎట్టకేలకు మెదక్ జిల్లా కేంద్రంలో భారత్ రైస్ అందుబాటులోకి వచ్చాయి. 5, 10 కిలోల బ్యాగుల్లో బియ్యం విక్రయిస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌వి కక్ష సాధింపు చర్యలు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తప్పిదాలు, హామీల అమలులో వైఫల్యాలను ప్రశ్నించడాన్ని ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందన్నారు. త్వరలోనే కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ– కార్ రేస్ నిర్వహణతో రాష్ట్రానికి మంచి పేరు వచ్చిందన్నారు. కేటీఆర్ గొంతు నొక్కాలనే నిధులు దుర్వినియోగం అయ్యాయని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

సొంత భవనంలోకి గ్రంథాలయం



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి శాఖా గ్రంథాలయాన్ని త్వరలో సొంత భవనంలోకి మార్చి పాఠకులకు చేరువ చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే జాబ్ కేలండర్ విడుదల చేసిందన్నారు. కౌడిపల్లి శాఖా గ్రంథాలయం కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతుండడంతో సౌకర్యాలు కరువయ్యాయని తెలిపారు. గ్రంథాలయం కోసం నిర్మించిన భవనంలో పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం కొనసాగుతుందన్నారు. పాఠకుల కోరిక మేరకు గ్రంథాలయాన్ని సొంత భవనంలోకి మార్చి పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని మరో భవనంలోకి మారుస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పాష, మాజీ సర్పంచ్‌లు శివాంజనేయులు, నర్సింగరావు, చంద్రం, కృష్ణా గౌడ్, శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సురేష్‌బాబు

చిన్నశంకరంపేట(మెదక్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని మిర్జాపల్లిలో జెడ్పీ పాఠశాలను పరిశీలించారు. అలాగే నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, డంప్‌యార్డుతో పాటు జీపీ రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం ఉందని, ఇలా ఉండకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా జీపీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు.

పశు సంరక్షణ తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

టేక్మాల్(మెదక్): పాడి రైతులు పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య సూచించారు. గురువారం మండలంలోని కాద్లూర్‌లో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల పెంపకం, పోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఆరోగ్య శిబిరం

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో 9 మంది వైద్యాధికారులు పాల్గొని కావాల్సిన మందులను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. దివ్యాంగుల కోసం ఇప్పటికే కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ప్రజావాణిని సైతం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సమ్మెలో 'సమగ్ర'ం

తమ సమస్యల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. ఈనెల 10 నుంచి విధులు బహిష్కరించి రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. నేటికీ 10 రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే వీరి సమ్మె ప్రభావం విద్యావ్యవస్థపై తీవ్రంగా పడింది. విద్యాశాఖలో అనేక రకాల సేవలు పూర్తిగా స్తంభించాయి. కేజీబీవీలు, భవిత కేంద్రాల్లో బోధన కుంటుపడింది.

స్తంభించిన విద్యా వ్యవస్థ

- కేజీబీవీ, భవిత కేంద్రాల్లో నిలిచిన బోధన
- జిల్లాలో 600 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు



కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

మెదక్‌జోన్: జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సుమారు 600 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు అత్యధికంగా విద్యాశాఖలోనే ఉన్నారు. పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలిస్తారు. ఇదే కాకుండా బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడం, పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పడం వంటివి చేస్తుంటారు. వీరంతా సమ్మెలో ఉండడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.

నిలిచిన కార్యకలాపాలు

- ప్రభుత్వం ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయకపోవడంతో వంట కార్మికులు అప్పులు తెచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నారు.
- వారం రోజుల క్రితం 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ. 1.67 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.
- కానీ ఈ బిల్లుల వ్యవహారం అంతా కంప్యూటర్ ఆపరేటర్లు (సమగ్ర శిక్ష) చూస్తుండడంతో కార్మికులకు బిల్లులు అందకుండా పోయాయి.
- జిల్లావ్యాప్తంగా 19 కేజీబీవీలు ఉండగా, వాటిలో వేలాది మంది అనాథ, పేద, మధ్య తరగతి బాలికలు చదువుకుంటున్నారు.
- కాగా ఈ పాఠశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అంతా సమగ్ర శిక్ష ఉద్యోగులే. వీరు పది రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారు.
- దీంతో బాలికలు చదువుకు దూరమవుతున్నారు. ఇప్పటికే ఇంటర్మీడియెట్ పరీక్షల షెడ్యూల్ వచ్చింది.
- మార్చిలో 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి.
- ఇలాంటి సమయంలో విద్యార్థినులకు బోధన అందకపోతే వారి భవిష్యత్ అంధకారమయ్యే పరిస్థితి ఉంది.
- మానసిక, శారీరక (దివ్యాంగులు) పిల్లలకు రోజూ ఫిజియోథెరపీతో పాటు పలు బొమ్మలు చూపుతూ బోధించటం సమగ్ర శిక్ష సిబ్బంది విధి.
- అయితే వీరు గత పది రోజులుగా సమ్మెలో ఉండడంతో భవిత సెంటర్లు పూర్తిగా మూతపడ్డాయి.
- ఇంత జరుగుతున్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- అయితే సమగ్ర శిక్ష ఉద్యోగులు మాత్రం ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- 'పది'లో జిల్లాను మొదటిస్థానంలో నిలబెట్టాలి
- ఎంఈఓలతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్ష


మెదక్ కలెక్టరేట్: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన జరగాలని, జిల్లాను రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిపేందుకు సమష్టి కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఎంఈఓలను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను బేరీజు వేసుకొని ఈ ఏడాది ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలుచేయాలని సూచించారు. విద్యార్థుల వారీగా వివరాలు తీసుకొని ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈనెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని సూచించారు. చదువుతో పాటు మంచి పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈఓ రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, సంబంధిత ఎంఈఓలు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు

మెదక్‌జోన్/కొల్చారం(నర్సాపూర్): ఈనెల 22వ తేదీన గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ మెదక్ చర్చితో పాటు కొల్చారం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శిస్తారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం చర్చిని సందర్శించి నిర్వాహకులు, అధికారులతో మాట్లాడారు. రూట్‌మ్యాప్, పార్కింగ్, చర్చి ఆవరణలో ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం కొల్చారం బాలికల గురుకుల కళాశాలను సందర్శించారు. వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్)/చిన్నశంకరంపేట/శివ్వంపేట: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే డ్రగ్స్, గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గంజాయి రవాణాను జిల్లాలో పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా సరఫరా జరుగుతున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. వెల్దుర్తి ఉమ్మడి మండలంలో అనుమతి లేకుండా మట్టి, ఇసుక రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనంతరం చిన్నశంకరంపేట, శివ్వంపేట పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు తనిఖీ చేశారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్పీ వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలో సీఎం కప్ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం బాల బాలికలకు అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి నాగరాజు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వీరు ఈనెల 27వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే శుక్రవారం మెదక్ స్టేడియంలో పురుషులకు, మహిళలకు చెస్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పా రు. కార్యక్రమంలో పీడీలు, వివిధ మండలాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఆర్డీఓ

తూప్రాన్: వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. చదువులో పోటీతత్వం అలవర్చుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణ, తరగతి గదుల పరిస్థితి, విద్యా బోధన ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రతను పర్యవేక్షించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

పిల్లల ఆహారంపై శ్రద్ధ అవసరం

అదనపు కలెక్టర్ నగేష్



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొల్చారం(నర్సాపూర్): వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు అందించే ఆహారం పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వంట గదిలోకి వెళ్లి ఆహార పదార్థాలతో పాటు ఉపయోగిస్తున్న సామగ్రిని పరిశీలించారు. వంట గదితో పాటు వంట కోసం ఉపయోగించే పాత్రలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గఫార్ మియా, ఆర్‌ఐ ప్రభాకర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

తూప్రాన్‌కు చేంజ్ మేకర్ అవార్డు



అవార్డును అందుకుంటున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

తూప్రాన్: 2021 నుంచి 2024 వరకు స్వచ్ఛత కార్యక్రమాలతో పాటు స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ప్రదర్శన చేపట్టినందుకు గాను తూప్రాన్ మున్సిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం అందించే చేంజ్ మేకర్ అవార్డు దక్కిందని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మున్సిపాలిటీలకు సీఎస్‌సీ, ఎంఓహెచ్‌యూఏ సంయుక్తంగా గురువారం ఢిల్లీలో అవార్డులు అందజేసింది. ఈ మేరకు డా.సునీత నరైన్ (సీఎస్‌సీ డైరెక్టర్) చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చింతల మధు ఉన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



దళిత సంఘాల నాయకుల రాస్తారోకో

కొల్చారం(నర్సాపూర్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రంగంపేటలో గురువారం ధర్నా నిర్వహించారు. మెదక్– సంగారెడ్డి రహదారిపై రహదారిపై బైఠాయించి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కొల్చారం పోలీసులు నాయకులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ.. అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి దేశద్రోహం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పామ్‌తో అధిక దిగుబడి

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతాప్‌సింగ్

తూప్రాన్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం పట్టణంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంట సాగు చేయాలని సూచించారు. ఎకరా వరికి సరిపోయే నీటితో ఐదెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని వివరించారు. జిల్లాలో 2023– 24లో 78 మంది రైతులు 336 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారని తెలిపారు. 2024– 25కు సంబంధించి ఇప్పటివరకు 1,623 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి కృష్ణ, ఉద్యానశాఖ అధికారి రచన, ఏఓ గంగుమల్లు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు రూ. 29 కోట్ల రుణాలు

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): డ్వాక్రా మహిళలకు ఈ ఏడాది రూ. 29.95 కోట్ల రుణాలు ఇవ్వాలనే లక్ష్యం పెట్టుకున్నామని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా రుణాలు, రికవరీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా రూ. 28.28 కోట్ల రుణాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ. 22.70 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. స్త్రీనిధి ద్వారా రూ.1.67 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ. 1.17 కోట్లు ఇచ్చామన్నారు. మిగితా రుణాలు సైతం ఈనెలాఖరు వరకు పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. మహిళలకు జీవనోపాధి కల్పించి సుస్థిర ఆదాయం వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, సీసీలు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోండి

కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు ఎంపీ షెట్కార్ వినతి



కేంద్రమంత్రికి పత్తి రైతుల సమస్యలు వివరిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: పత్తి పంటకు సరైన మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎంపీ సురేశ్ షెట్కార్ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కోరారు. ఈ ఏడాది పత్తికి రూ.7,521 ప్రకటించినా రైతులకు మాత్రం దక్కడం లేదన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో పత్తి రైతుల సమస్యలను వివరిస్తూ కేంద్రమంత్రికి గురువారం షెట్కార్ వినతిపత్రం అందించారు. వాతావరణంలో నెలకొన్న మార్పుల వల్ల అధిక తేమను సాకుగా చూపి కొనుగోలుదారులు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.100 నుంచి 200ల వరకు తక్కువగా చెల్లిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికశాతం రైతులు సీసీఐకి పత్తిని విక్రయించారని, అందువల్ల రైతులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఇబ్బందులు తీరేనా?



రామాయంపేటలో ఆర్డీఓ కార్యాలయం

- బోర్డుకే పరిమితమైన రామాయంపేట ఆర్డీఓ కార్యాలయం
- అసెంబ్లీలో మంత్రి ప్రకటనతో ఆశలు!



సిబ్బందిలేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రామాయంపేట(మెదక్): 'గత ప్రభుత్వ హయాంలో కొత్త రెవెన్యూ డివిజన్లను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీఎం, ఇతర మంత్రులతో చర్చించి వాటిని సరిచేసేలా చర్యలు తీసుకుంటా'నని ఇటీవల శాసనసభలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. నాలుగేళ్ల పాటు పార్టీలకతీతంగా పెద్దఎత్తున కొనసాగిన ఉద్యమంతో దిగివచ్చిన గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను ప్రకటించింది. నిరుపయోగంగా ఉన్న పాత హాస్టల్ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేసింది. గతేడాది అక్టోబర్‌లో అప్పటి మంత్రి హరీశ్‌రావు కార్యాలయాన్ని ప్రారంభించారు. 14 నెలల క్రితం ప్రారంభమైనా ఇప్పటివరకు గెజిట్ విడుదల కాకపోవడం గమనార్హం. కార్యాలయ ఏర్పాటు కేవలం బోర్డుకే పరిమితం కాగా.. ఇప్పటికీ ఆర్డీఓ, ఇతర సిబ్బందిని నియమించలేదు. కేవలం ఒక అటెండర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. తూప్రాన్ ఆర్డీఓకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

> **ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే..**
>
> రామాయంపేటకు ఆర్డీఓ పోస్టుతో పాటు ఇతర సిబ్బంది నియామకం కాలేదు. ఉత్తర్వులు జారీ కాగానే సిబ్బంది నియామకం చేపడుతాం. అప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు కొనసాగిస్తారు.
>
> **– నగేశ్, అదనపు కలెక్టర్, మెదక్**

డివిజన్ పరిధిలో మండలాలు

కొత్తగా ఏర్పాటు చేసిన రామాయంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోకి రామాయంపేట, నిజాంపేట, నార్సింగి , చిన్నశంకరంపేట మండలాలను చేర్చారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భవనంలో కొంత ఫర్నిచర్ తప్పించి కంప్యూటర్లు, సిబ్బంది ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్‌ను తాత్కాలికంగా ఆర్డీఓ కార్యాలయంలో నియమించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న రైతులు తమ పనులు కాకపోవడంతో గతంలో మాదిరిగానే మెదక్ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్తున్నారు. రామాయంపేటలో ఆర్డీఓ కార్యాలయం ప్రారంభమైనా తమ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు మెదక్ క్రీడాకారులు

తూప్రాన్: జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కోడిప్యాక నారాయణగుప్త గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 నుంచి జమ్మూ కాశ్మీర్‌లోని ఎంఏ క్రీడా మైదానంలో 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. 24 వరకు పోటీలు జరుగనున్న నేపథ్యంలో ఈ పోటీలకు రాష్ట్ర బాల, బాలికల జట్టుకు జిల్లాకు చెందిన 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని వివరించారు. నవంబరు నెలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బాలికల జట్టులో కార్తీక, శ్రీకృతి, శిరీష, గీతిక, బాలుర జట్టులో విజయ్, శ్రీవాత్సవ, వరుణ్, నిషాంత్ రాష్ట్ర జట్టులో స్థానం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు వెంకట్ రెడ్డి, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి


రాజు (ఫైల్)

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దేగల వెంకటరామరాజు (53) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గణేశ్ నగర్‌లో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రాజుకు ఉదయం గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ధరణి కుమార్, రాజేశ్, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.30 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కానిస్టేబుల్ అకస్మాత్తుగా మృతి చెందడంపై సీపీ అనురాధ సంతాపం వ్యక్తం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లిన వ్యక్తి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): దైవ దర్శనానికి వెళ్లి వస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌కు చెందిన నగేశ్ గౌడ్ (48) తన మిత్రులతో కలిసి 15వ తేదీ సాయంత్రం శబరిమలైలో అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్న అనంతరం బుధవారం తిరిగి తమిళనాడులోని మధురై చేరుకుని మీనాక్షి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు. రాత్రి అక్కడే ఉండి గురువారం ఉదయం రామేశ్వరం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తెల్లవారుజామున బాత్‌రూమ్‌కి వెళ్లొచ్చిన నగేశ్ గౌడ్ ఒక్కసారిగా బెడ్‌పై పడిపోయాడు. గమనించిన తోటి మిత్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

- అసెంబ్లీలో మంత్రి ప్రకటనతో మళ్లీ తెరపైకి
- పెండింగ్‌లోనే ఉన్న దుబ్బాక
- చిరకాల కల నెరవేరుతుందనే ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతోపాటు అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రస్తావన

దుబ్బాక : రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌లపై చర్చిస్తున్నామని అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో దుబ్బాక రెవెన్యూ డివిజన్ కల కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరుతుందనే ఆశ ప్రజల్లో నెలకొంది. ఈ సమావేశాల్లోనే రెవెన్యూ డివిజన్‌పై ప్రభుత్వం ప్రకటన వెల్లడిస్తుందని నమ్మకంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌కు అన్ని విధాలుగా అర్హత ఉన్నప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో 2016లో ఈ విషయంపై దుబ్బాక పట్టణంలో 45 రోజులపాటు ఉద్యమం తీవ్రంగా జరిగింది. పాత సమితి కేంద్రంగా, తాలుకాగా, నియోజకవర్గం కేంద్రంగా మున్సిపాల్టీగా ఉన్న దుబ్బాకకు రెవెన్యూ డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నా కాకపోవడంపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ డివిజన్ కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. నియోజకవర్గం కేంద్రాలైన గజ్వేల్, హుస్నాబాద్‌లను రెవెన్యూ డివిజన్లు చేసి నియోజకవర్గం కేంద్రమైన దుబ్బాకను చేయకపోవడం శోచనీయమని ప్రజలు వాపోతున్నారు.



92 రెవెన్యూ గ్రామాలతో డివిజన్

దుబ్బాక నియోజక వర్గంలో ప్రస్తుతం 8 మండలాలు ఉండగా చేగుంట, నార్సింగ్ మండలాలు తూప్రాన్ డివిజన్‌లో ఉన్నాయి. సిద్దిపేట డివిజన్‌లో ఉన్న దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, భూంపల్లి-అక్బర్‌పేట మండలాలతోపాటు గజ్వేల్ డివిజన్‌లో ఉన్న దౌల్తాబాద్, రాయపోల్ మండలాలతో కలిపి మొత్తం 6 మండలాలతో దుబ్బాక రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరు మండలాల పరిధిలో దుబ్బాక మున్సిపాల్టీతోపాటు 92 రెవెన్యూ గ్రామాలు 115 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2 లక్షలకు పైగా జనాభాతో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్, పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ, హార్టీకల్చర్ సబ్ డివిజన్ కార్యాలయాలతోపాటు బస్ డిపో ఉంది. కాబట్టి డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హామీ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాకలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఇచ్చిన హామీ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తప్పకుండా నెరవేరుతుందన్న గంపెడాశ ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది. 8 నెలల కిందట సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా కలువడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరగడం అందరికీ తెలిసిందే. కాకపోతే తాను దుబ్బాక రెవెన్యూ డివిజన్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల కోసమే సీఎం ను కలిశానని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సీఎం సానుకూలంగా ఉన్నారని తప్పకుండా ఈ దిశగా చర్యలు జరుగుతున్నాయనే ప్రచారం జోరందుకుంది.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం



దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి, మేధావులతో కలిసి ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకొని అఖిల పక్షం ఆధ్వర్యంలో సీఎం, మంత్రులను కలుస్తాం.

– మాదవోయిన శ్రీకాంత్, అఖిల పక్షం నాయకులు

- సీపీ అనురాధ
- సిద్దిపేటలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్


జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ, పక్కన ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించడం ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశ్యమని సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేట పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌ను బస్టాండ్ చౌరస్తా వద్ద ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్‌లతో కలిసి సీపీ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆర్ఏఎఫ్ సిద్దిపేటకు రావడం జరిగిందన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు పోలీసు అధికారులతో కలిసి బందోబస్తు నిర్వహించి, ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ, మేమున్నామనే భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 20న హుస్నాబాద్ పట్టణం, 21న గజ్వేల్ పట్టణంలో, 22న కొమురవెల్లి మండల కేంద్రంలో, 23న దుబ్బాక పట్టణంలో, 24న సిద్దిపేట వన్ టౌన్ పీఎస్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పట్టణంలో బస్టాండ్ చౌరస్తాతో పాటు ప్రధాన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ బగేల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ రద్దు చేసే వరకు పోరాటం

బెజ్జంకి(సిద్దిపేట) : పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోసం ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గుగ్గిల్ల శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యంగా మారే ఫ్యాక్టరీ రద్దు కోరుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారు స్పందించకుంటే రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, రూపేశ్, భాస్కర్, మధు, జనార్దన్, నరేశ్, మహేశ్, శ్రవణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, బెజ్జంకిలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐని గ్రామ స్థాయిలో బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అండగా ఉండి పోరాడాలన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): బతుకుదెరువు కోసం జార్ఖండ్ రాష్టానికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ర్యాగటోనిపల్లెకి చెందిన ర్యాగటి సారవ్వ-చంద్రయ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన ప్రవీణ్(25) బీటెక్ పూర్తి చేసి జార్ఖండ్‌లో హెచ్‌సీఎల్ సూర్థ మైన్స్ మైనింగ్ కంపెనీలో ఫోర్ మెన్‌గా ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. రోజు మాదిరిగా గురువారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉన్న ప్రవీణ్ మృతి చెందడం పల్లెవాసులకు కలచివేసింది.

నర్సాపూర్ రూరల్: సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖో ఖో జట్టుకు నర్సాపూర్ మండలం జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్జానా, పీడీ అశోక్ ఇతర అధ్యాపక బృందం అభినందించారు. ఇటీవల మెదక్‌ కేంద్రంలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి ఖో ఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఇందులో విద్యార్థులు దివ్య, ప్రసన్న, ఇందుప్రియ, భవ్య, వర్షిత, శ్రీజ, స్పందన, ప్రణీత, సాహిత, అక్షిత, రమ్య, సుప్రియ ఉన్నారు.

మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ విభాగంలో..

సంగారెడ్డి : సీఎం కప్ క్రీడల్లో భాగంగా అండర్ 19 మిక్స్‌డ్ డబుల్ బ్యాడ్మింటన్ విభాగంలో సగ్గల అక్షయ, ఖలీల్ గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు సంగారెడ్డి జిల్లా తరఫున ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా యువజన క్రీడల అధికారి ఖాసీం బేగ్, సెక్రటరీ జావీద్ అలీ హర్షం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు చేగుంట విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ శారద తెలిపారు. ఆమె కథనం మేరకు.. జిల్లా స్థాయిలో 200 మీటర్ల రన్నింగ్ పోటీల్లో గాయత్రీ మొదటి స్థానంలో, 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో అంకిత రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఎనగుర్తిలో కొత్త రాతియుగం నాటి ఆనవాళ్లు

- బండపై ఆది మానవులు తయారు చేసుకున్న పనిముట్ల గుర్తులు
- క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల నాటి పునరావాస ఆనవాళ్లు
- చరిత్ర పరిశోధకుల అన్వేషణలో వెలుగులోకి..



దుబ్బాక : దుబ్బాక మండలం ఎనగుర్తిలో కొత్తరాతి యుగం నాటి ఆనవాళ్లు వెలుగుచూశాయి. ఇటీవలె చరిత్ర పరిశోధకుల అన్వేషణలో ఎనగుర్తిలో కాశీ విశ్వనాథస్వామి ఆలయం సమీపంలో బండల మీద పురమానవుల ఆనవాళ్లు భయడపడటం విశేషం. ఎతైన గుట్ట మీద పెద్ద బండరాయిలపై పుర మానవులు తమ ఆహార సేకరణలో భాగంగా ఉపయోగించే రాతి పనిముట్లు (రాతి గొడ్డళ్లు) నూరుకున్న గుంతలను (గ్రూవ్స్) దాదాపు 20కి పైగా ఉన్నట్లు చరిత్ర పరిశోధకులు గుర్తించారు. ఈ ఆనవాళ్లను బట్టి ఈ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 5 వేల ఏళ్ల కిందట నాటి ఆదిమ మానవులు నివసించినట్లు చరిత్ర పరిశోధకులు తెలిపారు. ఎనగుర్తితోపాటు జిల్లాలోని సిద్దిపేట, నంగునూర్, నర్మెట్ట, వీరారెడ్డిపల్లిల్లోనూ ఆదిమ మానవుల ఆనవాళ్ల ఇదివరకే గుర్తించారు. తాజాగా ఎనగుర్తిలో వెలుగులోకి రావడం ఆసక్తికరంగా మారింది. దీనిపై ఇంకా లోతుగా పరిశోధిస్తున్నట్లు చరిత్ర పరిశోధకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.


పనిముట్లు నూరినట్లు ఆనవాళ్లు


ఆది మానవులు నివసించినట్లు గుర్తించిన ప్రాంతం